సమస్యల రణక్షేత్రం

అపరిశుభ్రతకు నిలయం పల్నాటి రణక్షేత్రం

- మచ్చుకైనా కానరాని పురావస్తు శాఖ రక్షిత చర్యలు
- అధ్వానంగా వీరుల గుడి ప్రాంగణం
- అసంపూర్తిగా ప్రహరీ నిర్మాణం


నిర్వహణలేని మహిళల వసతి భవనం


పల్నాటి వీరుల గుడి

కారెంపూడి: ఒకప్పుడు జిల్లాలో పర్యాటక క్షేత్రాల జాబితాలో పల్నాటి రణక్షేత్రం ఉండేది. వీరుల గుడిని దర్శనీయక్షేత్రాల జాబితాలో పేర్కొంటూ సమాచార శాఖతో పాటు బస్టాండ్‌లలో సైతం డిస్‌ప్లేలుండేవి. కానీ ఎందుకో ఇటీవల వీరుల గుడి ఆ జాబితాలో కన్పించడం లేదు. వాస్తవంగా కొండవీడు కోటతో పాటు పల్నాటి వీరుల గుడి పురావస్తు శాఖ పర్యాటక శాఖలు రక్షిత కట్టడాల జాబితాలో చేర్చారు. అయితే పల్నాటి వీరుల గుడి అభివృద్ధిని మాత్రం మరిచారు. రక్షిత కట్టడానికి తీసుకునే చర్యలు ఇక్కడ మచ్చుకైనా కన్పించడం లేదు. ఆవరణ అంతా కంప చెట్ల మయంగా కనిప్తుంది. ఎక్కడా సంరక్షిస్తున్న దాఖలాలు కానరావడం లేదు.

అపవిత్రంగా నాగులేరు

గుడికి పడమరగా దక్షిణం నుంచి ఉత్తరానికి పారుతున్న నాగులేరు వాగు చక్కని నీటి వనరుగా ఉంది. గుడికి పడమరగా నాగులేరు గంగధారి మడుగు కొంచెం దూరంలో చెన్నకేశవస్వామి, అంకాలమ్మ తల్లి ఆలయాలున్నాయి. వీరాచారులకు నాగులేరు గంగధారి మడుగు పరమ పవిత్రమైనది. ఇక్కడే స్నానాలు చేసి పల్నాటి వీరుల ఆయుధాలను శుభ్రం చేసుకుంటారు. అలాంటి ప్రాధాన్యం ఉన్న నాగులేరు నేడు వ్యర్థాలతో నిండిపోయి ఆచార నిర్వహణకు అసౌకర్యంగా మారింది.

ఆరుబయటే బస..


వసతి సౌకర్యాలు లేక గుడి ప్రాంగణంలో సేదతీరుతున్న ఆచారవంతులు (ఫైల్)

ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలోనే కాక ఇతర రాష్ట్రాలలో స్థిరపడిన వీరాచారులు కూడా వేలాదిగా తరలివస్తారు. వారు ఇక్కడ బస చేయడానికి కనీస వసతులు లేవు. పాడు బడిన రక్షణలేని నాపరాయి తెట్టె గోడల మధ్య గుడి ఆవరణలో ఆరుబయటే ఉండాల్సి వస్తోంది. ఈ ఐదు రోజుల ఉత్సవాలలో వారు పడే కష్టాలు చెప్పనలవి కానివిగా ఉన్నాయి. స్త్రీలు, చిన్న పిల్లలు ఆయబయటే చలికి వణికిపోవాల్సి వస్తోంది. స్నానాలు ఆచరించడానికి నాగులేరు ఒడ్డున సరైన సౌకర్యాలు లేవు. టాయిలెట్స్ లేవు. ఇలాంటి చోట వేలాది మంది ఐదు రోజులు బస చేసి రేయింబవళ్లు పరమ పవిత్రమైన పల్నాటి వీరాచారాన్ని నిర్వహించడం వారికి ఎంతో కష్టం. అయితే ఆచార వ్యవహారాలపై ఉన్న భక్తి శ్రద్ధలతో ఎంత కష్టమైనా అలాగే నెట్టుకొస్తున్నారు. దీనివల్ల ఉత్సవ శోభ మసకబారుతోంది.

కనీస సౌకర్యాలు లేవు..



గుడికి ఆదాయం లేదు. వంశ పారంపర్యంగా అతికష్టంమీద ఉత్సవాలను నిర్వహిస్తున్నాం. అందుకు అప్పులు కూడా చేస్తున్నాం. ఇదిలా ఉంటే కనీసం వీరాచారవంతులకు ఇక్కడ ఉండడానికి తావు లేదు. కనీస సౌకర్యాలు లేవు. ప్రభుత్వం వసతి గృహాలు నిర్మించాలి. ఉత్సవాల నిర్వహణకు వచ్చే వీరాచారవంతులు ఐదు రోజులుండడానికి వసతి కల్పించాలి, పేరుకే గొప్ప చరిత్ర అని.. ఇక్కడ వస్తే సౌకర్యాలు లేవనే అపవాదు పోయే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పల్నాటి చారిత్రక వైభవాన్ని భావితరాలకు అందించేందుకు వీరుల గుడిని గొప్ప చారిత్రక చిహ్నంగా అభివృద్ధి చేయాలి.

– పిడుగు తరుణ్ చెన్నకేశవ అయ్యవార్, పల్నాటి వీరాచార పీఠాధిపతి

సౌకర్యాలపై దృష్టి ఏది?


పిచ్చిమొక్కలు, కంపచెట్లతో నిండిన వసతి గదులు

గతంలో రూ.2.5కోట్లతో పురావస్తు, పర్యాటక శాఖలు వీరుల గుడి అభివృద్ధికి శ్రీకారం చుట్టాయి. వీరుల గుడిని, ఇతర మండపాలను మరమ్మతులు చేసి గుడిలో ఫ్లోరింగ్ చుట్టూ ప్రహరీ నిర్మించారు. పురాతనత్వం పోకుండా చర్యలు తీసుకున్నారు. బ్రహ్మనాయుడు చాపకూడు మండపం, స్త్రీలకు వసతి గృహం ఒకటి కట్టించారు. ప్రహరీ ముందు లాన్ పెంచే చర్యలు చేపట్టారు. కానీ ఆ తర్వాత మాత్రం అభివృద్ధి ఆగిపోయింది. అసలు ముఖ్యమైన పనులన్నీ అలాగే ఉండిపోయాయి. ముఖ్యంగా ఉత్సవాలకు వచ్చే వీరాచారులకు వసతి గృహాలు లేవు. వారంతా ఆరుబయటే ఉంటూ ఐదు రోజుల వీరాచారాన్ని నిర్వహించుకుంటున్న దుస్థితి కన్పిస్తోంది. ఆలయ ప్రాంగణంలో ఆక్రమణలను పూర్తిగా తొలగించలేదు. దీంతో ప్రహరీ కూడా అసంపూర్తిగా మిగిలిపోయింది. నవంబరు 30 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు ఐదు రోజుల పాటు పల్నాటి వీరారాధన ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్సవాల సౌకర్యాల విషయమై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు ఘనసన్మానం



దాచేపల్లి: డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ అవార్డు గ్రహీత అంబటి శ్రీనివాసరావును యూటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. నారాయణపురంలో నివాసం ఉంటున్న అంబటి శ్రీనివాసరావు విద్యారంగంలో అందిస్తున్న విశిష్టమైన సేవలను సదరన్ ప్రైవేట్ లెక్చరర్ టీచర్స్ ఆర్గనైజేషన్ గుర్తించి ఈ అవార్డుని అందజేసింది. దీంతో స్థానిక యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసరావును శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించి అభినందించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వట్టిపు నాగేశ్వరరావు, మండలశాఖ అధ్యక్షుడు రాజారావు, నాయకులు షేక్ మస్తాన్‌వలి, మాతంగి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా టపాసులు విక్రయించొద్దు



దాచేపల్లి: అనుమతులు లేకుండా టపాసులు విక్రయించవద్దని తహసీల్దార్ వైవీ కుటుంబరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో టపాసుల వ్యాపారులతో సమావేశం శనివారం జరిగింది. నివాస గృహాలకు దూరంగా టపాసు విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రమాదవశాత్తు ప్రమాదాలు జరిగితే తక్షణ చర్యలు తీసుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సూచించారు. అధిక రేట్లకు టపాసులు విక్రయించవద్దని ఆయన చెప్పారు.

26 సీసీ కెమెరాలు అందజేత



పిడుగురాళ్ల: పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో గుదె వెంకటేశ్వర్లు అనే దాత 26 సీసీ కెమెరాలను అందజేశారని సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణాన్ని మరింత నిఘా నేత్రంలో ఉంచాలని పలువురికి సీసీ కెమెరాల ఆవశ్యకతను గురించి తెలియజేశామని, దీనిలో భాగంగానే గుదె వెంకటేశ్వర్లు స్పందించి సుమారు రూ. 56 వేలతో 26 సీసీ కెమెరాలను అందజేశారని, వెంకటేశ్వర్లను సీఐ అభినందించారు. పట్టణంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


మృతుడు చిరుమామిళ్ల లింగయ్య

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతల గ్రామ శివార్లోని హోసన్నా మందిరం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుడు చిరుమామిళ్ల లింగయ్య(55) మృతి చెందాడు. గ్రామానికి చెందిన లింగయ్య రెంటచింతల నుంచి ద్విచక్రవాహనంపై గురజాలకు వెళ్తూ రోడ్డు పక్కన ఉన్న మట్టికుప్పపైకి ఎక్కి అదుపు తప్పి రోడ్డుపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో వెంటనే లింగయ్యను పిడుగురాళ్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తలకు తీవ్రంగా గాయం కావడంతో చికిత్స పొందుతూ లింగయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పిడుగురాళ్ల: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన పట్టణంలోని ఖలీల్ దాబా వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఖలీల్ దాబా వద్ద పిడుగురాళ్ల వైపు నుంచి చిన గార్లపాడు గ్రామానికి బిళ్ల కోటేశ్వరరావు, బత్తుల లింగాలు, చల్ల నాగరాజులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా హైదరాబాద్ నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొనటంతో ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరికి ప్రాథమిక చికిత్స నిర్వహించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నర్సరావుపేటకు తరలించినట్లు ఎస్ఐ మోహన్ తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

బెల్లంకొండ: మండలం కేంద్రంలో శనివారం అయ్యప్ప మాలధారణ స్వాముల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. కోళ్లూరి ప్రసన్నాంజనేయ స్వామి ఆల యంలో ఉన్న అయ్యప్ప విగ్రహాన్ని బెల్లంకొండ స్వాములు ఊరేగింపుగా తీసుకువచ్చారు. మేళతాళాల నడుము స్వామి వారిని తీసుకువచ్చి, మార్గ మధ్యలో నాగిరెడ్డిపాలెం కాలువలో స్వామి వారికి చక్రస్నాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాలధారణ చేసిన భక్తులు జల బిందెలతో ఊరేగింపుగా స్వామి వారిని బెల్లంకొండకు తీసుకువచ్చారు. మండల కాలం మాలధారులు పూజలు నిర్వహించేందుకు స్వామి వారిని స్థానిక శివాలయంలో ఉంచారు. గురుస్వాములు కుందుర్తి బాల వీరాంజనేయులు, మద్దు రామాంజనేయులు పాల్గొన్నారు.

రూ.4.50 లక్షల నగదు ప్రోత్సాహకాలు అందజేత


విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న ప్రెసిడెంట్ గణేష్, ఎంఈఓ పినాకపాణి


రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న సాగర్ గ్రూప్ ప్రెసిడెంట్ గణేష్

దాచేపల్లి: రక్తదానం మహాదానం అని సాగర్ గ్రూప్ ప్రెసిడెంట్ గణేష్ అన్నారు. మండలంలోని గామాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీలో సాగర్ గ్రూప్ ఫౌండర్ చైర్మన్ సమ్మిడి వీరారెడ్డి 90వ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం శనివారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గ్రూప్ ప్రెసిడెంట్ గణేష్ ప్రారంభించారు. 101మంది కార్మికులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ గణేష్ మాట్లాడుతూ.. మనం ఇచ్చే ప్రతి రక్తపు చుక్క ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడుతుందన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని ఆయన కోరారు. రక్తదానం చేసిన కార్మికులను అభినందించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు...

సాగర్ గ్రూప్ ఫౌండర్ చైర్మన్ సమ్మిడి వీరారెడ్డి జయంతి సందర్భంగా రూ4.50లక్షల నగదు ప్రోత్సాహకాలను విద్యార్థులకు అందజేశారు. దాచేపల్లి మండల పరిధిలో జిల్లా పరిషత్ హైస్కూల్స్, ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కేజీబీవీలో 2023–24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన 30మంది విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. మొదటి బహుమతిగా రూ.20వేలు, రెండవ బహుమతిగా రూ.15వేలు, మూడవ బహుమతిగా రూ.10వేల చొప్పున 30మందికి రూ4.50లక్షల నగదు, షీల్డ్స్, సర్టిఫికెట్లను ప్రెసిడెంట్ గణేష్, ఎంఈఓ పినాకపాణి చేతుల మీదుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అందజేశారు. ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు తాము సహకారం అందిస్తామని, తల్లిదండ్రుల కలలను నేరవేర్చేందుకు విద్యార్థులు మరింత కష్టపడి చదువుకోవాలని ఆయన కోరారు. ప్లాంట్ హెడ్ సుబాబ్బరావు, ఏజీఎంలు శంకర్ నారాయణరెడ్డి, నాగేశ్వరరావు, జీఎం నరేంద్రరెడ్డి, సుబ్బారెడ్డి, సీఎస్‌ఓ కొండారెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ నూతనశాఖ ప్రారంభం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో కెనరా బ్యాంక్ నూతన శాఖను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విజయవాడ సర్కిల్ జనరల్ మేనేజర్ సీజే విజయలక్ష్మి, గుంటూరు రీజనల్ ఆఫీసర్ ఆఫీస్ ఏజీఎం యు.రామోహన్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై రిబ్బన్‌కట్ చేసి బ్యాంక్ నూతన శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించటంతోపాటు, రైతులకు పంట రుణాలు, బంగారంపై రుణాలు అందించటం జరుగుతుందని తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, సిబ్బంది ఎస్‌కే జాని, రాధానాయక్, డాక్టర్ పోరెడ్డి వెంగళరెడ్డి, బాసులింగారెడ్డి, చిన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

తెగులు పట్టిన వరి పొలాల సందర్శన

రైతులకు సూచనలందించిన వ్యవసాయాధికారి కట్టా లక్ష్మారెడ్డి

సాక్షి ఎఫెక్ట్

మాచర్ల రూరల్: వరి పంటకు తెగుళ్లజీ పట్టి రైతులు నష్టపోతున్న వైనంపై. 'వరి పై తెగుళ్ల దాడి' శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. శనివారం మండలంలోని జమ్మలమడక గ్రామంలో వ్యవసాయాధికారి కట్టా లక్ష్మారెడ్డి వరి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వైరస్ నివారణకు క్లోరిఫైపాస్, మోనోక్రోటోపాస్, హైడ్రోన్‌లు 400గ్రా చొప్పున ఒక ఎకరాకు తగినంత నీటితో పిచికారీ చేయాలని సూచించారు. ఎరువుల వినియోగం తగ్గించాలని, పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో పొలంలో నీటి నిల్వ లేకుండా చేయాలని రైతులకు సూచించారు.

పరిశుభ్రమైన తాగునీరు అందించాలి

అమరావతి: మండలంలో పరిశుభ్రమైన తాగునీటిని ప్రజలకు అందించడంపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని, అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో డయేరియా విజృంభిస్తోందని మండలంలో ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పట్ల శ్రద్ధ వహించాలని, మంచి నీటి క్లోరినేషన్ ప్రతిరోజు చేయించాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని, గ్రామంలోని వీధులను శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతిరోజు చెత్తను సేకరించాలని, వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు సేవలు అందించాలని పేర్కొన్నారు. సమయపాలన పాటించాలన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టి.పార్వతీ, ఈవోపీఆర్డీ పద్మజ పాల్గొన్నారు.

వాకర్లకు ఇబ్బందులు లేకుండా చర్యలు

మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్


వాకింగ్ ట్రాక్ వద్ద పిచ్చిమొక్కలను తొలగింపజేస్తున్న కమిషనర్

పిడుగురాళ్ల: వాకర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని చెరువు కట్ట వద్ద గల వాకింగ్ ట్రాక్‌ను మున్సిపల్ కమిషనర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్‌పై ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలను తొలగించాలని శానిటేషన్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. గుంతలు ఏర్పడకుండా చూడాలన్నారు. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అర్బన్ మార్కెట్ సెంటర్ పరిశీలన..

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్ సెంటర్‌ను మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ మార్కెట్ ద్వారా 57 మందిసభ్యులు తయారు చేసిన వస్తులను అమ్మకాలకు పెట్టటం జరిగిందన్నారు. ప్రజలు మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అర్బన్ మార్కెట్‌ను వినియోగించుకోవాలి ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు పాల్గొన్నారు.

'పట్టభద్రుల' ఓటుకోసం 2055 దరఖాస్తులు


మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ బత్తుల వాణి

మాచర్ల రూరల్: గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు నమోదుకు ఇప్పటివరకు 2055 దరఖాస్తులు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ బత్తుల వాణి, ఎన్నికల డీటీ గుంటు రమణలు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 10, ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ పాసైన వారు మాత్రమే అర్హులని, వచ్చే నెల 6వ తేదీలోపు సంబంధిత కార్యాలయంలో కానీ, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు మాచర్ల పట్టణంలో ఆఫ్‌లైన్‌లో 96, ఆన్‌లైన్‌లో 487, రూరల్‌లో ఆఫ్‌లైన్‌లో 45, ఆన్‌లైన్ 287, వెల్దుర్తి ఆఫ్‌లైన్ 1, ఆన్‌లైన్ 213, దుర్గి ఆఫ్‌లైన్ 12, ఆన్‌లైన్ 274, రెంటచింతల ఆఫ్‌లైన్ 8, ఆన్‌లైన్ 302, కారంపూడి ఆఫ్‌లైన్‌లో 12, ఆన్‌లైన్‌లో 318 అప్లికేషన్‌లు వచ్చాయన్నారు. అర్హత ఉండి దరఖాస్తు చేసుకోవాలనుకునేవారు డిగ్రీ సర్టిఫికెట్‌పై గెజిటెడ్ ఆఫీసర్ సంతకాన్ని అటెస్టెడ్ చేయించి అప్లయి చేసుకోవాలని వారు కోరారు.

యానిమేటర్ల తొలగింపుపై హైకోర్టు స్టే

తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఉత్తర్వులు

బెల్లంకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరునాడే బెల్లంకొండ మండలంలోని పలు గ్రామాలకు చెందిన యానిమేటర్లను విధుల నుంచి తొలగించారు. అనంతరం మండలంలోని 7 గ్రామాల్లో కొత్త యానిమేటర్లను నియమించాలంటూ జూలై 31న స్థానిక టీడీపీ నాయకులు సూచనల మేరకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కార్యాలయం నుంచి సిఫారసు లేఖను సంబంధిత అధికారులకు పంపారు. దీంతో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమను అకారణంగా విధుల నుంచి తొలగించడం అన్యాయం అంటూ వారు హైకోర్టుకు వెళ్లారు. మండలంలోని చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన చింతల వెంకటలక్ష్మి, వన్నాయపాలెం గ్రామానికి చెందిన గడ్డం శ్రీలేఖ, చంద్రాజుపాలేనికి చెందిన చిలకా రమాదేవి, నందిరాజుపాలెం గ్రామానికి చెందిన నామాల లక్ష్మీ అనే నలురుగు యానిమేటర్లు ఈ నెల 7న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వారి పిటిషన్ పరిశీలించిన న్యాయస్థానం వారి తొలగింపుపై స్టే విధించింది. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ డీఆర్‌డీఏ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. కాగా హైకోర్టు ఉత్తర్వులతో యానిమేటర్లు శుక్రవారం మండల డీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లారు. ఏపీఎం ఉషశ్రీని కలసి కోర్టు ఉత్తర్వులను అందజేశారు. తమను విధుల్లో తీసుకోవాలని యానిమేటర్లు ఆమెను కోరారు. కాగా యానిమేటర్లను తొలగించడం, విధుల్లోకి తీసుకోవడం తమ బాధ్యత కాదని, పూర్తిగా గ్రామ సంఘాల వీఓలకే ఆ అధికారం ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో వీఓల తీర్మానంతో తొలగించడం, విధుల్లోకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో మాట్లాడుకుని విధుల్లో చేరాలంటూ కోర్టు ఉత్తర్వులను తీసుకోలేదు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం తమను విధుల్లోకి చేర్చుకోకపోతే, కోర్టు ధిక్కారం చేస్తున్నారని, తిరిగి కోర్టుకు వెళతామని యానిమేటర్లు తెలిపారు.

నూతన డైరీ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి


డైరీని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని శ్రీ శ్రీనివాస సీలింగ్ చానల్స్ కంపెనీకి చెందిన 2025వ ఏడాదికి చెందిన నూతన సంవత్సర డైరీని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా పలువురు సిబ్బందికి డైరీలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కంజుల రామకోటిరెడ్డి, విజయవాడ కనకదుర్గమ్మ వారి దేవస్థానం మాజీ డైరెక్టర్ నిడమానూరి సురేంద్ర, ఎన్‌కె ఆంజనేయులు, కొమ్మసాని కమలాకర్‌రెడ్డి, మాజీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొత్తూరు కిషోర్, భవిరిశెట్టి నాగేశ్వరరావు, పాదిలే ఖాజా పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా కసిన్యా నాయక్

కారెంపూడి: కారెంపూడి ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ (ఎఫ్ఏసీ)గా కారెంపూడి పంచాయతీ కార్యదర్శి కె.కసిన్యానాయక్‌ను నియమిస్తూ ఎంపీడీఓ శనివారం ఉత్తర్వులిచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఈఓపీఆర్డీ పీహెచ్ సత్యప్రసాద్ దుర్గి ఈఓపీఆర్డీగా బదిలీ కావడంతో కసిన్యానాయక్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

సబ్సిడీపై టార్పాలిన్ పట్టలు పంపిణీ



వెల్దుర్తి: రైతులకు మేలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా ముందుకొస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలో రైతులకు సబ్సిడీపై టార్పాలిన్ పట్టలను అందించి ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహిళలు సమాజంలో గౌరవంగా బతకాలి


మాట్లాడుతున్న ఏపీఎం, డీబీఆర్‌సీ కో-ఆర్డినేటర్

రాజుపాలెం: మహిళలకు అనేకమైన చట్టాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకుని ధైర్యంగా సమాజంలో గౌరవంగా బతికే అవకాశం తెలుసుకోవాలని ఏపీఎం శివకుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు రక్షణ చట్టాలపై అవగాహన సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఏపీఎం శివకుమార్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు దూసుకుపోతున్నారని తెలిపారు. ప్రతి మహిళ డ్వాక్రా గ్రూపులలో ఉండి పొదుపు కట్టుకుని శ్రీనిధి ద్వారా తీసుకున్న నిధులతో జీవనోపాధి పొందవచ్చన్నారు. డీబీఆర్‌సీ ఏరియా కో-ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. మండల మహిళా అధ్యక్షురాలు కాసంబి, సీసీ కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి భద్రత

మలేరియా జోనల్ అడిషనల్ డైరెక్టర్ వీరరాజు

దొడ్లేరు(క్రోసూరు): పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యం చేకూరుతుందని మలేరియా అడిషనల్ డైరెక్టర్ జి.వీరరాజు అన్నారు. శనివారం ఆయన మండలంలోని దొడ్లేరు, అచ్చంపేట మండలం నిండుజర్ల గ్రామాలను సందర్శించి గ్రామాల్లో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రై డే కార్యక్రమాలను పరిశీలించారు. ఆయన వెంట వచ్చిన బృందం ఎంటమాలాజికల్ సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి వస్తువుల్లో, తొట్లల్లో దోమ లార్వాను పరిశీలించారు. దోమతెరలు వాడాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. రెండు, మూడు రోజులకి మించి జ్వరం వస్తే సమీపంలోని ఆరోగ్య, ఆశ కార్యకర్తలను సంప్రదించాలన్నారు. దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి వాటిని నిర్వీర్యం చేయడం ద్వారా దోమ కాటు ద్వారా సంభవించే వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులను అరికట్ట వచ్చన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం డ్రైడే విధిగా పాటించాలన్నారు. అనంతరం ఆయన ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి వంట గదిని పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల హెచ్ఎం టి.సామ్రాజ్యం, ఉపాధ్యాయులు టి.సదాశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.